అగ్గిపుల్లగీశాడు రమణ! ఆ వెలుతురులో రమణ యెడమ చేతి మణికట్టుకు క్రిందవున్న కాలిన మచ్చచూచి మచ్చ మాయదనే సత్యాన్ని తలచుకొని నిట్టూర్చి అడిగాడు శేషగిరి!

"నీ యెడమచేతి మణికట్టుక్రింద ఆ మచ్చేమిటి రమణా!"

"చిన్నప్పుడు తెలియక నిప్పు తీసుకొందామని కుంపట్లో చేయిపెడితే కాలిందట! అదిసరిలే! నీ కథ ప్రారంభించు"

శేషగిరి బరువుగా నిట్టూర్చి కథ చెప్పటం ప్రారంభించాడు.

"మా స్వగ్రామం చల్లపల్లి, శుద్ధ పల్లెటూరు. చదువుకోసమని మా పినతల్లిగారింటికి పంపించారు నన్ను. అక్కడ 8వ ఫారము చదువుచుండగా నా జీవిత శకటం తొలిసారిగా పట్టాలు తప్పింది. మా చిన్నాన్న హైస్కూలు టీచరు కావటంవల్ల, మా యింట్లోనే అద్దెకు వచ్చిన డిప్యూటీ తాసిల్దారుగారి అమ్మాయి అమీరున్నీసా కూడా నాతోబాటు మా చిన్నాన్నదగ్గరే చదువు ప్రారంభించింది. అప్పటికి నాకు పదిహేనేళ్ళుంటాయి. అమీర్ నాకన్న పెద్దదో చిన్నదో తెలియదుగానీ శారీరికంగా పెద్దవాళ్ళలోనే జమకోస్తుంది. అర్ధసంవత్సరపు పరీక్షలయిపోయాయి. సంక్రాంతి పండుగ సెలవులు. ఒకనాటి సాయంకాలం మరీ చలిచలిగా వుంది. నేను మా రీడింగు రూములో ఒంటరిగా కూర్చుని జాషువాగారి స్మశానవాటిక చదువుకొంటున్నాను. అమీరున్నీసా వచ్చింది. ఆనాడు ఆమె పెదవులమీద చిరునవ్వు ముఖంలోని నూతన వికాసం ప్రతిక్షణం చూస్తున్న నాకే క్రొత్తగా తోచింది. తెలియనివాళ్ళెవరూ ఆమెను మహమ్మదీయ కన్య అనుకోరు. అచ్చంగా హిందూ బాలికలాగే వుంటుంది బొట్టు మినహాయిస్తే! వస్తూనే నా యెదురుగా నిలుచుని గిరీ ప్రేమంటే యేమిటంది? "నాకు తెలియదు" అన్నాను. "నేను చెప్పనా" అంది. చెప్పమన్నాను. వెంటనే నా రెండు చేతులు పుచ్చుకొని తన మెడకు చుట్టబెట్టుకొని నన్ను తన గుండెలకద్దుకొని బలంగా కౌగిలించి ముద్దుపెట్టుకుని "ఇదే ప్రేమంటే!" అంది. అప్పటికి ఇంచుమించుగా నేను మూర్ఛపోయిన స్థితిలో వున్నాను. వళ్లంతా గగుర్పాటుతో వేడెక్కిపోయింది. రక్తపు పోటుతో మెదడులోని నరాలు బ్రద్దలవుతాయేమో అనుకొన్నాను. చలిజ్వరం వచ్చినవాడిలా గజగజలాడిపోయాను. "అదేమిటి గిరీ అలా అయిపోతావేం?" అంది నా గడ్డం పట్టుకొని. అప్పటికి పూర్తిగా తెలివొచ్చింది. ముద్దు పెట్టుకొన్న బుగ్గ తడుముకొంటూ "ఛీ ఛీ" అన్నాను. అమీరు చిన్నబుచ్చుకొని వెళ్లిపోయింది. ఆ రాత్రి భోజనము, చదువు యెలాగో అయిందనిపించి పెందలకడే ప్రక్క చేరాను. ఎంత ప్రయత్నించినా నిద్దర రాలేదు. అప్పుడే వలయాలు నిర్మించుకొంటున్న ఆమె వక్షోజసంస్పర్శలు నాగుండెల కింకా గిలిగింతలు పెడుతూనే వున్నాయి. ఆ సంగతి తలచేకొలదీ నాలో ముగ్ధకాంక్షలు గుబాళింపసాగాయి. ఆ పరిష్వంగానుభవంతో నరాల్లో ఉప్పెనలా రక్తం ప్రవహించింది. కణకణాల్లోను ఆ అనుభూతి మరలా మరల పొందాలనే కోరిక క్రమక్రమంగా బలీయం కాజొచ్చింది. నా నూతన యౌవన ప్రదోష రేఖలతో బాటు తూర్పునకూడా అరుణారుణ రేఖలు ప్రస్ఫుటించాయి. తెల్లవారి ఉన్నీసాముఖం చూడటం యెలాగా అని నాలో నేనే తత్తరపడిపోతున్నాను. ఆమెమీద యింతకుముందెన్నడూ లేని యేదో అధికారమమకారం — ముసకచీకటిలాగ గుండెల్లో ముసిరి, సిగ్గుదొంతరలు మంచుతెరలులాగ క్రమ్మసాగాయి. నేనంత బాధపడుతూవుంటే యింకా యేడుగంటలు కాకుండానే అమీరున్నీసా అప్సరసలా తయారై వచ్చి చిరునవ్వుతో "ఏం గిరీ! కళ్ళెర్రగావున్నాయి రాత్రి నిద్దరపట్టలేదా" అని కిలాకిలా నవ్వేసింది. ఆమె ధైర్యానికి నిబ్బరానికి అబ్బురుపోతూ తలవంచుకొని వెళ్ళిపోయాను.

ఆనాటినుంచీ అటువంటి తరుణం యెప్పుడు వస్తుందా అని యెదురుచూస్తూ నేవున్నాను. అప్పట్లో నా కా విషయాన్ని ప్రస్తావించే ధైర్యము లేకపోయింది. కోరికకంటె పిరికితనం బలీయమయింది. ఆమే సాహసిస్తే బావుండుననుకొనేవాడిని. నాకిష్టం లేదనుకొందోయేమో నా బాధ తెలియనట్లుగా వూరుకొంది. ఆ పిరికితనంతోనే మూడుమాసాలు మహాబాధగా మనసు మనసులో లేకుండా నిర్జీవంగా గడిపాను. పెద్ద పరీక్షలైపోయాయి. అనుకోనకుండా పిడుగుపడింది. ఆ ముందు వేసవిలో అమీరు తండ్రి డిప్యూటి తాశిల్దారుగారు స్వయంగా నడుపుతున్న జీపురోడ్డుప్రక్క చెట్టుకు ఢీకొని హాస్పిటల్లో చేరక

డాబా తలుపులుతీసి తనను పేరుపెట్టి పిలుస్తూవుంది. విస్తుబోయాడు. డాబాలో లైట్లు వెలిగాయి. ఆ మెర్క్యురీదీపపు కాంతిలో ఆమె బంగారపుముద్దలా మెరుస్తూవుంది. "అమీర్" అని గట్టిగా అరవాలనుకున్నాడు. కాని నోరు పెకలిరాలేదు. ఈసారి ఆమె చేతితో సైగచేసి రమ్మంది. యాంత్రికంగా నడిచి లోపలకువెళ్ళాడు. ఆమె తలుపులు గడియపెట్టింది.

"తలుపువేస్తావేం?"

"నక్కలు రాకుండాను"

"మరి మీఆయన రాడా"

"వచ్చినవాడే మా ఆయన."

"అంటే" అమీరున్నీసా దాపరికంలేకుండావున్న సంగతులన్నీ యదార్థంగా చెప్పింది తను చేసిన తప్పులు. తత్ఫలితంగా తానిప్పుడు అనుభవిస్తున్న నరకం వివరించింది. తనదగ్గరెంతడబ్బుందో కూడా చెప్పింది.

"మరి సినీమాలో నీప్రక్కన కూర్చున్నదెవరు?"

"నాకు తెలియదు. హోటలుకు భోజనానికి వచ్చేవాళ్లే చిరునామాలు భోజనంపెట్టేవాడికెందుకు? డబ్బిచ్చుకుని అన్నంపెడతాడు! అంతే" శేషగిరి మాట్లాడలేకపోయాడు.

"నీకు పెళ్ళయిందా" అడిగింది.

"లేదు" అన్నాడు.

"చేసుకోవా?"

"ఊహూ"

"ఎందుకని."

"ఇష్టంలేక"

"ఇందాక నీతో సినిమాకువచ్చిన అమ్మాయెవరు?"

"మా ఆఫీసులో టైపిస్టు."

"ఆవిడతో యెందుకొచ్చావు?"

"రమ్మంది."

"ఎవరు రమ్మంటే వాళ్ళతో వచ్చేస్తావా?"

శేషగిరి మాట్లాడలేకపోయాడు.

"గిరీ! నా జీవితంనుంచి నీవు నేర్చుకోవలసింది చాలా వుంది. ఒక్క తప్పటడుగు ఎన్ని అనర్థాలు తెస్తుందో నాకు తెలుసు."

ఈసారికూడా శేషగిరి మాట్లాడలేదు.

"ఈరాత్రి యిక్కడ పడుకొంటావా?"

"ఊహూ! వెళ్ళిపోతాను."

"సరే! అమ్మ కులాసాగావుందా."

"ఆ!"

"ఒక్కమాట! నీతో చెప్పాలని యెన్నాళ్ళనుండో అనుకొంటున్నాను. దైవసాక్షిగా చెప్పాలంటే నా యీ అధోగతికి కారణం నువ్వు! ఇలా అంటున్నానని కంగారుపడకు! నా తొలియౌవన పూజలు నీకర్పించాలనుకున్నాను. కానీ నీవు నిరాకరించావు! ఆ వ్యథతో కాలుజారి తప్పుడు మార్గం పట్టాను. అయినప్పటికీ నీమీది వ్యామోహం నాకు చావలేదు. అందుకే ఆనాటి తెల్లవారుఝామున అలా చేశాను. అప్పుడేకాదు యెప్పటికీ నా హృదయం నీదే! కానీ యిప్పుడు నువ్వు కావాలన్నా నా వంటిమీద చేయి వేయనివ్వను. నా శరీరం యిప్పుడు రోగమయం; నా మనసు, నాకున్న సర్వస్వం నీది. నీకే క్షణంలో కావలిసే ఆ క్షణంలో వచ్చి పట్టుకువెళ్ళు. వేలు సంపాదించాను."

"నాకెందుకు?"

"ఏమో నాకు తెలియదు. నాకు నీవు తప్ప మరెవ్వరూ లేరు. నా మనసు నెప్పుడో నీకంకితం చేశాను. నా సంపదకూడా నీదే" అమీరు మనస్తత్వం అర్థంగాక తెల్లబోయి నిలుచున్నాడు శేషగిరి.

"సరే వెళ్లు! త్వరగా వెళ్లు! నిన్ను చూస్తూవుంటే నాకు పాడుబుద్ధి పుడుతుంది. వెళ్ళిపో! కానీ నేను చనిపోయేలోగా వచ్చి యీ ఆస్తి అంతా పట్టుకుపో! వెళ్లు గిరీ" ఆమె ఉద్రేకం అర్థంకాలేదు.

"అమీర్" అన్నాడు గట్టిగా.

"నీ అమీరున్నీసా చచ్చిపోయింది. ఇప్పుడీ శరీరం పేరు తాయారు."

"పేరు మార్చుకొన్నావా?"

"అవును."

"ఎందుకు?"

"ఇక్కడి అవసరం అటువంటిది. నీకు తెలియదులే! వెళ్ళు." అంది. అతను మాట్లాడకుండా బయటకు వచ్చాడు. వెంటనే తలుపులు తప్పుకుని గడియ వేసుకొంది లోపల! ఆ యింటిమెట్లు దిగుతూవున్న శేషగిరినిచూచి రోడ్డుమీదవచ్చాడేవాళ్లు చిలిపిచిలిపిగా నవ్వారు. వాళ్ళనవ్వుకు కారణం అర్థంకాకపోయినా అయినటుగానే తలపంకించి రమణ ఇంటివైపు నడిచాడు శేషగిరి. అప్పటికే రమణ హాల్లో పడుకొని నిద్రపోతున్నాడు. శేషగిరికూడా ప్రక్కనున్న మడత మంచంమీద నడుంవాల్చి తాయారుగా మారిన అమీరున్నీసాను తలచుకొంటూ నెమ్మదిగా నిద్రలోకి జారిగిపోయాడు. లోపల యేదో గడియతీసిన చప్పుడై

